ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
మంగళవారం 5 నవంబరు 2024 www.prajaasswaramdaily.com 4 pm




## సిద్దిపేట జిల్లాలో ఆటో బోల్తా

**పది మంది విద్యార్థులకు గాయాలు**

సిద్ధిపేట, ప్రజాస్వరం : సిద్ధిపేటజిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో 10 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన దుబ్బాక శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విద్యార్థులను తీసుకొని స్కూల్‌కు వెళ్తుండగా దుబ్బాక శివారులోకి ఆటో రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను దుబ్బాక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మీ తల్లి జన్మదినం నుంచైనా అమలు చేస్తారా?



రేపు ఏమైనా ప్రకటిస్తారా? అని రాహుల్ గాంధీని ప్రశ్నించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

420 హామీలపై తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్

హైదరాబాద్, ప్రజాస్వరం : రాహుల్ గాంధీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల అమలుపై మాట్లాడాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. డిసెంబరు 9వ తేదీ సోనియాగాంధీ జన్మదినం ఆరోజు నుంచైనా అమలు చేస్తారా? రేపు ఏమైనా ప్రకటిస్తారా? రైతు భరోసా ఎప్పుడు అమలు చేస్తారు? కౌలురైతులకు ఎప్పుడిస్తారు? రైతు కూలీలకు ఎప్పుడిస్తారు? నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు? మహిళలకు రూ. 2500 ఎప్పుడిస్తారు? రుణమాఫీ ఎప్పుడు పూర్తి చేస్తారు? రైతులకు బోనస్ ఎప్పుడిస్తారు? తులం బంగారం ఎప్పుడు ఇస్తారు? స్కూటీలను ఎప్పుడిస్తారు?.. ఇవన్నీ కూడా కనీసం రాహుల్ గాంధీ వస్తున్నప్పుడు తెలంగాణ ప్రజలకు చెప్పాల్సిందిగా కోరుతున్నామని తెలిపారు.

## రేపటి నుంచే కులగణన



హైదరాబాద్, ప్రజాస్వరం : కులగణనను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది కాంగ్రెస్ ప్రభుత్వం. రేపటి నుంచి తెలంగాణ వ్యాప్తంగా కులగణన సర్వే ప్రారంభం కానున్న తరుణంలో సర్వం సిద్ధం చేశారు. ఈ క్రమంలోనే బీసీ జనాభా గణాంకాల సేకరణకు ప్రత్యేకంగా కమిషన్ ఏర్పాటు చేయాలని హైకోర్టు సూచన మేరకు ప్రభుత్వం ఉత్తర్వుల విడుదల చేసింది. బీసీ కులగణనకు డేడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కమిషన్ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ భూసాని వెంకటేశ్వర్ రావును నియమించారు. నెలరోజుల్లో కమిటీ రిపోర్టు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలో బీసీ జనాభా లెక్కలను శాస్త్రీయమైన పద్ధతిలో తేల్చాలని హైకోర్టు సూచించింది. దీని కోసం 2 వారాల్లో డెడికేటెడ్ కమిషన్‌ను నియమించాలని అక్టోబర్ 30న ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం వారం రోజుల్లోనే ఈ కమిషన్ ను నియమించింది.

**డిసెంబరు 9న గణన పూర్తి**

డిసెంబర్ 9లోగా బీసీ కులగణన పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది. బీసీ వర్గాల్లోని కులాలు, వాటి ఉపకులాల లెక్క తేల్చబోతున్నారు. వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతుల వివరాలను సైతం సేకరించనున్నారు. మొత్తం 60 రోజుల్లో ప్రక్రియ పూర్తి కానున్నట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. కులగణనకు అవసరమైన ప్రొఫార్మాను బీసీ కమిషన్ ఇప్పటికే తయారు చేసింది. దాదాపు 54 నుంచి 64 ప్రశ్నలతో ప్రశ్నావళిని సిద్ధం చేసినట్టు సమాచారం.



## కాన్పూర్‌లో బెంగాల్ తరహా ఘటన

**నర్సింగ్ విద్యార్థినిపై ఆస్పత్రి డైరెక్టర్ లైంగిక దాడి..!**


**లక్నో: బెంగాల్ జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటన మరిచిపోక ముందే ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో అదే తరహాలో మరో ఘటన చోటు చేసుకున్నది. నైట్ షిఫ్ట్‌లో ట్రైనింగ్‌కు వెళ్లిన 22 ఏళ్ల విద్యార్థినిపై కల్యాణ్‌పూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రి డైరెక్టర్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం బయటకు చెబితే చంపేస్తానని బెదిరంపులకు పాల్పడ్డాడు. నర్సింగ్ విద్యార్థిని సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.**

అర్ధరాత్రి సమయంలో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిందితుడైన ఆస్పత్రి డైరెక్టర్‌ను అరెస్టు చేశారు. విద్యార్థిని వైద్య పరీక్షల కోసం పంపారు. సచెంది పోలీస్ స్టేషన్ పరిధిలోని 22 ఏళ్ల యువతి నర్సింగ్ కళాశాలలో జేఎన్ఎం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. గత కొన్ని రోజులుగా ఆమె నేపాలీ దేవాలయం సమీపంలోని డబుల్ రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో శిక్షణ పొందుతున్నారు. ఆదివారం రాత్రి ఆసుపత్రిలో నైట్‌షిఫ్ట్ ఉందని విద్యార్థిని పేర్కొంది. తెల్లవారు జామున 4 గంటలకు నిద్రరావడంతో హాస్పిటల్ విశ్రాంతి గదిలో నిద్రపోయింది. ఆస్పత్రి డైరెక్టర్ ఇంతియాజ్ అలియాస్ సితు విద్యార్థిని పడుకున్న గదిలోకి వెళ్లి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమెను బెదిరింపులకు గురి చేసి.. నోట్లో దూది పెట్టి లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆరోపణలున్నాయి. సదరు విద్యార్థిని ఉదయం ఆసుపత్రికి వచ్చిన తోటి నర్సులు, ఇతర సిబ్బందికి తెలుపడంతో అందరూ కలిసి పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. అయితే, అత్యాచారానికి ముందు నర్స్‌కి కూల్‌డ్రింక్‌లో మత్తు మందు కలిపి ఇచ్చినట్లు అనుమానిస్తున్నారు.

## హైదరాబాద్‌లో మహిళపై సామూహిక అత్యాచారం

హైదరాబాద్, ప్రజాస్వరం : నగరంలోని మధురానగర్ పరిధిలో ఓ మహిళపై దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ముగ్గురు యువకులు తనపై అత్యాచారం చేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పని ముగించుకుని వస్తుండగా మాయమాటలు చెప్పి తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. అనంతరం ఒకరిని అదుపులోకి తీసుకున్నారు.

## రోడ్లను హేమ మాలినీ బుగ్గల్లా నున్నగా చేస్తా



**ఆప్ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు ఖండించిన బీజేపీ ఎమ్మెల్యేలు**

**మహిళలను అగౌరవపరిచారు...**

**ఢిల్లీ** :డ్రీమ్ గర్ల్, ఎంపీ హేమ మాలినీపై ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఎమ్మెల్యే నరేష్ బల్యాన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉత్తమ్ నగర్ రోడ్లను హేమ మాలినీ బుగ్గల్లా నున్నగా చేస్తానంటూ వ్యాఖ్యానించారు. 'ఉత్తమ్ నగర్ రోడ్లను హేమ మాలినీ బుగ్గల్లా సన్నగా చేస్తాను' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం దుమారం రేపుతున్నాయి. ఆప్ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. ఢిల్లీ బీజేపీ అధికార ప్రతినిధి ప్రవీణ్ శంకర్ కపూర్ ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఆయన వ్యాఖ్యలు మహిళలను అగౌరవపరిచేలా, స్థానిక సమాజాన్ని అవమానించేలా ఉన్నాయన్నారు. ఓ మహిళను అగౌరవపరిచేలా మాట్లాడిన ఎమ్మెల్యేపై తగిన చర్యలు తీసుకోవాలంటూ ఆప్ సుప్రిమో అరవింద్ కేజ్రీవాల్‌ను డిమాండ్ చేశారు. మరోవైపు ఆప్ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై పలువురు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కాగా, రాజకీయ నేతలు హేమ మాలినీపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇదేమీ తొలిసారి కాదు. గతంలో మహారాష్ట్ర మంత్రి ఒకరు ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. జల్గావ్ జిల్లాలోని తన నియోజకవర్గంలో రోడ్లను ప్రముఖ నటి హేమ మాలినీ బుగ్గలతో పోల్చారు. ఆ రోడ్లను ఎంత బాగా అభివృద్ధి చేశానో విపక్ష నేతలు వచ్చి చూడాలని సవాల్ విసిరారు. అవి హేమ మాలినీ బుగ్గల్లా నున్నగా ఉన్నాయంటూ వ్యాఖ్యానించారు.

## 2036 ఒలింపిక్స్ ఇండియాలోనే ?

**ఐఓసీకి లేఖ పంపినట్లు జాతీయ మీడియా కథనం**

**ఐఓసీ కూడా భారత్ వైపు మొగ్గు చూపేందుకు ఆసక్తి**

**ఢిల్లీ : ఒలింపిక్స్ కు ఆతిథ్యం ఇచ్చేందుకు భారత్ సమాయత్తమవుతోంది. 2036 ఒలింపిక్స్, పారాలింపిక్స్ నిర్వహణకు ఆసక్తి వ్యక్తీకరణ తెలియజేస్తూ ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ (IOC)కి అధికారికంగా లేఖను పంపిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ మేరకు ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అక్టోబర్ 1వ తేదీనే దీనిని పంపినట్లు తెలుస్తోంది. 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యమిచ్చేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలు చేస్తామని, ఈ విషయంలో వెనక్కి తగ్గమని గతంలో ప్రధాని మోదీ వెల్లడించిన సంగతి తెలిసిందే. "ఒలింపిక్స్ నిర్వహణ కోసం భారతీయులు ఉత్సాహంగా ఉన్నారు. 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిచ్చేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలనూ చేస్తాం. ఏ విషయంలోనూ వెనక్కి తగ్గం. ఇది 140 కోట్ల భారతీయుల కల. అలాగే 2029 యూత్ ఒలింపిక్స్‌ను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని ఆయన అన్నారు.**



మరోపక్క.. 2028 (లాస్ ఏంజిల్స్), 2032 (బ్రిస్బేన్) ఒలింపిక్స్ వేదికలు ఖరారయ్యాయి. దాంతో అందరి చూపు 2036పై పడింది. "2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం భారత్ రేసులో ఉంది" అని భారత ఒలింపిక్ కమిటీ గతంలో వెల్లడించింది. 2025లో ఐఓసీ అధ్యక్ష ఎన్నికల తర్వాత 2036 ఒలింపిక్స్ ఆతిథ్య దేశాన్ని ఎంపిక చేసే అవకాశం ఉంది. విస్తృత స్థాయిలో బిడ్డింగ్ కాకుండా ఆసక్తి ఉన్న దేశాల నుంచి వచ్చే దరఖాస్తులను పరిశీలించి ఐఓసీ నాయకత్వ విభాగం ఈ ఆతిథ్య హక్కులను కట్టబెట్టే ఆస్కారం ఉంది. స్పాన్సర్లు, ప్రసార హక్కులు, ప్రభుత్వ మద్దతు, ప్రజల ఆదరణ.. ఇలా ఏ రకంగా చూసుకున్నా భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించడం వల్ల ఐఓసీకి లాభం చేకూరే అవకాశం ఉంది. అందుకే ఐఓసీ కూడా భారత్ వైపు మొగ్గు చూపేందుకు ఆసక్తితో ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## ఇందిరాపార్క్‌కు ఆటోలో కేటీఆర్ ప్రయాణం

**ఆటోడ్రైవర్ల ధర్నాకు మద్దతు**

**హైదరాబాద్, ప్రజాస్వరం:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆటోలో ప్రయాణించారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఆటో డ్రైవర్ల మహా ధర్నా ప్రాంతానికి ఆయన ఆటోలో చేరుకున్నారు. కేటీఆర్ మొదట నందినగర్‌లోని తన నివాసం నుంచి కారులో బయలుదేరారు. ఆ తర్వాత కొందరు సీనియర్ నాయకులతో కలిసి ఆటో ఎక్కిన కేటీఆర్ మహాధర్నా వద్దకు చేరుకున్నారు. ఆటో డ్రైవర్‌తో కేటీఆర్ కాసేపు ముచ్చటించారు. ఆయన ఆటోలో కూర్చొని వెళుతుండగా కొంతమంది కార్యకర్తలు, అభిమానులు ఆయనతో సెల్ఫీ తీసుకోవడానికి పోటీపడ్డారు.

**హామీలు అమలు చేయాలని మహాధర్నా**

రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత బస్సు పథకం కారణంగా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఆటో డ్రైవర్లు మహాధర్నా నిర్వహిస్తున్నారు. ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నారు. మహాలక్ష్మి



స్కీంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం నేపథ్యంలో ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీనిని వెంటనే అమలు చేయాలని డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. యాప్‌లతో అనుమతి లేకుండా నడుస్తున్న టూ వీలర్లను నిషేధించాలని కోరుతున్నారు. ప్రమాద బీమాను రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.